క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మక్తల్: పట్టణంలోని యాదవ్‌నగర్‌లో శ్రీవేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన టెలిఫోన్ లక్ష్మీనారాయణ రూ.1,01,116, ఆశప్ప రూ.51 వేలు విరాళం అందించారు. ఆలయ కమిటీ తరఫున వారిని సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్, కవాలి శ్రీహరి, మామిళ్ల కిష్టప్ప, తిరుపతి, నర్సిములు, గోపి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

నర్వ: ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని క్లస్టర్ హెచ్‌ఎం నర్సిములు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పెద్దకడ్మూర్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బయోసైన్స్‌పై బోధనా పక్రియలను ఉపాధ్యాయులు బోధన పరికరాలతో ప్రజెంటేషన్ చేపట్టారు. బోధనా పరికరాలను వినియోగించి విద్యార్థులకు సలుభమైన పద్ధతిలో బోదన చేయాలన్నారు. సమావేశంలో మరికల్, ధన్వాడ, నర్వ ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసులు, బాబురెడ్డి, రమేష్, అరుణ్, జాన్సన్, శ్రావణి, సీఆర్పీ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి భక్తుల ప్రయాణం

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాల్లోని శివ మాలధారులు మహాశివరాత్రి పురస్కరించుకొని గురువారం ఇరుముడితో శివయ్య సన్నిధికి బయలుదేరారు. మాగనూర్‌లోని శివ మాలధారులు ఉదయం నుంచి స్థానిక ప్యాటీశ్వరలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడిలు కట్టుకున్నారు. అనంతరం శివనామ స్మరణతో శ్రీశైలం బయలుదేరి వెళ్లారు.

హామీలకే పరిమితం

దామరగిద్ద: బీఆర్‌ఎస్ నాయకులు హామీలకే పరిమితం అయ్యారని బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కొత్తకాపు రతంగ్‌పాండ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 78, 79, 80 పోలింగ్ బూత్ స్థాయి పరిధిలో శక్తి కేంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి, వంటి పథకాలు హామీలకే పరిమితమయ్యాయన్నారు. దళిత, గిరిజన బంధు పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. అన్ని వర్గాల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. అనంతరం యువకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ప్రభాకర్‌వర్ధన్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గోపాల్‌రావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్ మాణక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువుకు నీరు అందించాలి

ధన్వాడ: మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కోయిల్‌సాగర్ కాలువ నుంచి పెద్ద చెరువుకు నీరు అందించాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ నర్సన్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఒకటో శక్తి కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువును నీటిని విడుదల చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం అధ్యక్షుడు ఉదయభాను, ఎంపీటీసీ మాధవి, ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, కార్యదర్శి శివకుమార్, ఎర్రప్ప, నారాయణ, బాలరాజు, నారాయణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మొక్కల కుండీలు

మరికల్: జాతీయ రహదారి ఇరువైపులా మొక్కలను నాటేందుకు సర్పంచ్ సిమెంట్ రింగులతో కుండీలను ఏర్పాటు చేశాడు. ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ఒక మొక్క కూడా నాటలేదని పలువురు తెలిపారు. దీంతో వ్యాపారులు చెత్తను కుండీలలో వేస్తూ అపరిశుభ్రం చేస్తున్నారు. టీ కప్పులు, ప్లాస్టిక్ కవర్లు వేసి నిప్పు పెడుతున్నారు. దీంతో కుండీలు అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు ముక్కును మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోయారు. కుండీలు ఏర్పాటు చేసి ప్రజాధనం వృథా చేయడం సరికాదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా మొక్కలు నాటి కుండీలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం మండలంలో జోరుగా కొనసాగుతుంది. మండలంలోని ఇప్పటి వరకు 7 గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారిణి శ్రీలత గురువారం తెలిపారు. ఇప్పటి వరకు 8,029 మందిని పరీక్షించగా వెంటనే 746 మందికి కళ్ల అద్దాలు అందజేశామన్నారు. మరో 1,054 మందికి వారికి సరిపోయే అద్దాల తయారీకి నివేదిక పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం మద్దూరు, దోరేపల్లిలో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నట్లు అమె పేర్కొన్నారు. ఈ నెల 21 వరకు మద్దూరు పట్టణంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

బోధన, భోజనం నాణ్యతగా ఉండాలి

- ప్రతి పాఠశాలలో ఇదే అమలు చేయాలి
- నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు: కలెక్టర్



అనుగొండలో పునరావాస కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మక్తల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం నాణ్యతగా అందించకపోయినా, బోధన సరిగా లేకపోయినా కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. మండలంలోని మక్తల్, కర్ని, చందపూర్, చిట్యాల, అనుగొండ, రుద్రసముద్రం గ్రామాల్లో పర్యటించారు. లెసన్ ప్లాన్ ప్రకారం బోధించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా, చతుర్విధ ప్రక్రియలు సాధించేలా కృషి చేయాలని చెప్పారు. పరీక్షలు దగ్గరపడుతున్నందు వల్ల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలకు మంజూరైన మన ఊరు– మనబడి నిధులతో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయించాలని, నాణ్యతను పరిశీలించాలని చెప్పారు. కొనసాగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అనుగొండలో మాట్లాడారు. పునరావాస కేంద్రం ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. 613 మందికి ప్లాట్లు కేటాయించారని, 80.12 ఎకరాలు ఏర్పాటు చేశామన్నారు. పునరావాస బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్, డీఈ రాము, సర్పంచ్ గడ్డం రమేష్, ఎంపీటీసీ పద్మ రాములు, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, మంగులాల్, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న సాయికుమార్

మక్తల్: జాతీయ విద్యా విధానం–2020ని అమలు చేయాలని పట్టణంలోని గురువారం అయ్యప్పస్వామి డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ సామాన్యులకు విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సర్కార్ పాఠశాలలను నిర్లక్ష్యం చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో అవి మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అజయ్, కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, శివలింగమ్మ, శ్రావణి, అనివర్ధన్, హన్మేష్ పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో తాగునీటి ఎద్దడి



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా తాగునీరు సరఫరా చేయడం లేదు. దీంతో కాలనీవాసులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రజల సౌకర్యార్థం వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించి మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రధాని ధ్యేయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రతంగ్‌పాండురెడ్డి

నారాయణపేట: దేశంలోని 140 కోట్ల ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగ్‌పాండు రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని హనుమాన్ మందిరంలో పళ్ల, జంగిడి గడ్డ, బూత్‌లకు సంబంధించి శక్తి కేంద్రాల కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ నీరు, నిధులు, నియామకాల పేరుతో రెచ్చగొట్టారన్నారు. ఆంధ్రోళ్లు తెలంగాణను దోచుకుంటున్నారని మాయమాటలతో మోసం చేస్తున్నాడన్నారు. బంగారు తెలంగాణ చేసినట్లు కేసీఆర్ చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. కరోనా సమయంలో 130 కోట్ల మంది టీకాలు వేసి ప్రజల ప్రాణాలను రక్షించిన ఘనత ప్రధానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పరిగి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్‌వర్ధన్, రఘురామయ్యగౌడ్, మల్లేశ్, పాండు, ఉశేనప్ప, కతలప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



దామరగిద్ద: పదోతరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు సాయంత్రం వేళలో అల్పాహారం పంపిణీని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ కోయ శ్రీహర్ష, విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో విద్యార్థులకు పాలు, బిస్కట్‌లతో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 139 మంది ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంభులింగం తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న భాస్కర్

నర్వ/మద్దూరు: తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ పార్టీ బుట్టదాఖలు చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పడాకుల శ్రీనివాస్ అన్నారు. పెద్దకడ్మూర్‌లో గురువారం నిర్వహించిన శక్తికేంద్రాల కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జలందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ ఫలాన్ని ప్రజలకు అందిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కమలం వికసించేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, శక్తికేంద్రాల ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, ఆంజనేయులు, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, నరేష్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

పల్లెర్ల గ్రామంలో..

పార్టీ గెలుపు కోసం ప్రతి బీజేపీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సూచించారు. గురువారం మద్దూరు మండలంలోని పల్లెర్ల గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. గ్రామంలోని 54, 55, 56, 57 బూత్ కమిటీల శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ చందుగౌడ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. రాబోవు రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ నాయకులు మదన్, కూర వెంకటయ్య, శంకర్, సాయిలు, వెంకటయ్య, రవికుమార్, నరహరిచారీ, కిష్టప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం



ధన్వాడ: ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆదరించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో గురువారం కొండాపూర్ కాంప్లెక్స్, గురుకుల పాఠశాలలో ఆయన ఉపాధ్యాయులను కలిశారు. దాదాపు 15 సంవత్సరాలు ప్రభుత్వ లెక్చరర్‌గా సేవలు అందించానని విద్యారంగం సమస్యలపై అవగాహన ఉందని వివరించారు. కార్యక్రమంలో గోవిందు, నరేందర్, చిన్నరాయుడు, నరసింహారెడ్డి, రవివర్మ, రవికుమార్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు జాగృతి సాంస్కృతిక పోటీలు



కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రామకృష్ణ మఠం 125వ ఆవిర్భావ వార్షికోత్సవం వేడకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారు విద్యార్థులకు జాగృతి సాంస్కృతిక పోటీలను రామకృష్ణ సేవాసమితి మద్దెల్‌బీడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి అంజప్ప, హెచ్‌ఎం విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు రామకృష్ణ ప్రభ ప్రత్యేక సంచిక వ్యక్తిత్వ వికాసానికి ఎంతోగానో తోడ్పుతాయన్నారు. పాఠశాలలో పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామకృష్ణ మఠం ద్వారా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌గౌడ్, సంతోష్, సునీత పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు కోసం ఉద్యమిస్తా



నర్వలో ప్రచారం చేస్తున్న మాణిక్‌రెడ్డి



మాగనూర్‌లో మాట్లాడుతున్న శేర్ కృష్ణారెడ్డి

నర్వ: టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు రాజేష్ అన్నారు. గురువారం నర్వ, ధన్వాడ, కొండాపూర్‌లో యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్వలో పాఠశాల క్లస్టర్ సమావేశంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న యూటీఎఫ్‌కు ప్రతి ఉపాధ్యాయుడు అండగా నిలబడాలని కోరారు. సంఘం బలపర్చిన తనకు మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు గోవిందు, రమేష్ బాబు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: సీపీఎస్ విధానం రద్దు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమిస్తానని యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాంప్లెక్స్ పాఠశాలల్లో ఎమఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తన గళం వినిపిస్తానన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, రాజేష్‌కుమార్, రమేష్‌బాబు, వెంకటేష్, శివరాజ్, రాఘవేంద్రచారి, బాల్‌రాం, గోవిందు, వేణుగోపాల్, వెంకట్‌స్వామి తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మాగనూర్: ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యల వల్ల ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారమే ఏవీయన్ రెడ్డి లక్ష్యమని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహ అన్నారు. గురువారం మండలంలోని మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ..దాదాపు 15ఏళ్లుగా ప్రభుత్వ లెక్చరర్‌గా సేవలు అందించి విద్యారంగంపై సుదీర్ఘమైన అనుభవం కలిగిన ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంప్లెక్సు హెచ్‌ఎం నర్సింహులు, తపస్ మండల అధ్యక్షుడు రాంమ్మోహన్, రాఘవేంద్ర, కళావతి పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వార్యంలో..

అన్ని ఉన్నత పాఠశాలల్లో పండిత, పీఈటీల పోస్టుల ఉన్నతీకరణ ప్రక్రియ పూర్తి చేసి, తక్షణమే పదోన్నతులు కల్పించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న గారి మాణిక్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ కాంప్లెక్సు, ఉన్నత పాఠశాలలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వాహించారు. ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలని, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, వేణుగోపాల్, గోవిందు, వెంకటస్వామి, రాజేష్‌కుమార్, వెంకటేష్, రమేష్, బాబు, శివరాజు, మహేందర్‌గౌడ్, బలరాం, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు కృషి



ఊట్కూరులో కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఊట్కూరు: కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటయ్య కోరారు. గురువారం ఊట్కూరులోని జీపీఎస్ పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌ఎన్ తొలిమెట్టు కార్యక్రమంలో సాధించాల్సిన లక్ష్యం ఎంతో ఉందని, ఉపాధ్యాయులు సమష్టి కృషితో ప్రయత్నం చేసి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశాలు విద్యార్థుల మార్పుకు దిక్సూచిగా పనిచేయాలని ప్రతి సమావేశంలో కొత్త కొత్త మెలకువలు నేర్చుకోవాలన్నారు. మన ఊరు మన బడి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేశ్, సెక్రెటరీ అనిత, ఆర్పీ అనిల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

కోస్గి: పట్టణంలోని మున్నూర్ వీధిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ నాభి శిలా(బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వేడుకగా జరిగింది. తిమ్మనబావి శివాంజనేయ స్వామి ఆలయ మాలధారులు నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ అనంతరం విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా చేశారు. విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి విగ్రహ సందర్శన, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, వేదాశీర్వచనము అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీ నాభి శిలా దేవి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవం వైదిక తపోనిధి రుద్రాక్షల మఠం అమరలింగ స్వామి ఆధ్వర్యంలో వైదిక రత్న వీరేశలింగం, పరమేష్ శాస్త్రి, మఠం శివకుమార్, మఠం వినయ్‌కుమార్ సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కోస్గి: గుండుమాల్ మండలంలోని హన్మాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎంగా అనుశ్రీ వ్యవహారించగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సిములు, ఉపాధ్యాయులు నరేష్, అనంతయ్య పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్



ధన్వాడలో మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

ధన్వాడ: ఓట్ల కోసం ప్రజలను వాడుకుంటూ వారికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు శివకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాజాకార్ల పాలన సాగుతోందని, పథకాలు పేపర్లపైన మాత్రమే ఉన్నయని వాటిని అమలు మాత్రం చేయడం లేదన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూంలు అందించలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇందులో మండల అధ్యక్షులు నరహరి, ఆనంద్, జిల్లా నాయకులు శివకుమార్, దమోదర్‌రెడ్డి, బాలకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగోలితో కేసీఆర్ చిత్రం



తెలంగాణ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ధన్వాడకు చెందిన ఉపాధ్యాయుడు లద్దల్ బాల్‌రాజు రంగోలితో చంద్రశేఖర్‌రావు చిత్రాన్ని తీర్చిద్దిదాడు. ఈయన దేవరకద్ర మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

– ధన్వాడ

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కరువు

- డీఈఓ ఆగ్రహం
- మండలంలో పలుపాఠశాలలు తనిఖీ



తళంకేరి పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఈఓ లియాకత్ అలీ

మాగనూర్: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యలో కనీస సామర్థ్యాలు కూడా లేకపోవడంపై డీఈఓ లియాకత్‌అలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి రాబోవు ఏప్రిల్ ఎస్‌ఏ–2 పరీక్షల సమయానికి సిద్ధం చేయకపోతే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని తళంకేరి, గురవలింగంపల్లి, వర్కూర్, నేరడగం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తళంకేరి గ్రామంలో ఏకోపాధ్యాయునితో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామసర్పంచ్ రామస్వామి, జెడ్పీటీసీ వెంకటయ్య డీఈఓకు లిఖిత పూర్వకంగా తెలిపారు. దీంతో ఆయన పాఠశాలను పరిశీలించారు. ఇక్కడ మరో ఉపాధ్యాయుడిని కేటాయించడాన్ని పరిశీలిస్తామని తెలిపారు. గురవలింగంపల్లి పాఠశాలలో విద్యార్థులతో సంభాషించి పలుఅంశాలపై ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. వర్కూర్ గ్రామంలో నిర్వహించి కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొన్ని ఉపాధ్యాయులకు పలుసలహాలు, సూచనలు అందజేశారు. నేరడగం పాఠశాలలో పదో తరగతికి సంబంధించిన 8మంది విద్యార్థులు రూ.125లు పరీక్ష ఫీజు కూడా కట్టలేకపోవడంపై వివరణ తీసుకున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోతే కనీసం ఉపాధ్యాయులైన మానవతాదృక్పథంతో ఉపాధ్యాయులే ఫీజు కట్టి, పరీక్ష రాసేలా చూడాలని సూచించారు. నేరడగం పాఠశాలలో మన ఊరు–మన బడి పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. తాను పరిశీలించిన అన్ని పాఠశాలల్లో నేడు మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదని అన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు, అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తీరు మార్చుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. లేకపోతే వంట ఏజెన్సీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంబీఎం యాదయ్య, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,606

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ క్వింటా గరిష్ఠంగా రూ.7,606, కనిష్ఠంగా రూ.4,509, ఎర్రకంది క్వింటా రూ.8,232, కనిష్ఠంగా రూ.6,209 పలికింది. పెసర క్వింటా గరిష్ఠంగా రూ.8,326, కనిష్ఠంగా రూ.7,606 పలికాయి. కాటన్‌మిల్లులో పత్తి క్వింటా గరిష్ఠంగా రూ.7,900, కనిష్ఠంగా రూ.4,500 పలికాయి.